సాక్షి
విజయనగరం

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



పోలమాంబను దర్శించిన కలెక్టర్

శంబరపోలమాంబ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. - 8లో



పశుబీమాలోనూ.. 'పచ్చ'పాతం..!

ప్రభుత్వం మారింది.. ప్రతీ పథకానికి పేరు మారింది. యూనిట్లలో కోత.. లబ్ధిదారుల కుదింపు ప్రక్రియ మొదలైంది. - 8లో

16న గ్రీవెన్స్‌సెల్ రద్దు

విజయనగరం క్రైమ్: ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 16న సోమవారం సెలవుదినంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్‌సెల్)ను రద్దుచేసినట్టు ఎస్పీ వకుల్‌జిందాల్ శుక్రవారం తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

న్యూస్‌రీల్

18న మెగా జాబ్‌మేళా

- కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, ఎమ్మెల్యే మాధవి

విజయనగరం ఫోర్ట్: నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలోని మిరాకిల్ ఎడ్యుకేషనల్ సొసైటీలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 18న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జాబ్ మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే మాధవితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో 29 ప్రముఖ కంపెనీలలో 2,500 పోస్టుల భర్తీ చేస్తారన్నారు. దీనిని 18 నుంచి 36 ఏళ్ల మధ్య వయస్సుగల ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లమా, ఇంజినీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నెలకు రూ.12వేల నుంచి రూ.60 వేల వరకు జీతం లభిస్తుందని తెలిపారు. ఎక్కువ ఉద్యోగాలు హైదరాబాద్‌లో కల్పిస్తారన్నారు. ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్‌తో అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు జేయేష్ సెల్:82971 92497, తరుణ్ సెల్: 80994 61303 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

విజయనగరం లీగల్: జాతీయ లోక్‌అదాలత్ శనివారం (ఈ నెల 14న) జరగనుందని, కక్షిదారులందరూ వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయికళ్యాణ్ చక్రవర్తి కోరారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అన్ని కోర్టుల్లోనూ జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తామన్నారు. రాజీ పడదగిన క్రిమినల్, మోటారు ప్రమాద బీమా, బ్యాంకు, చెక్కుబౌన్స్, ప్రామిసరీ నోట్, ఎలక్ట్రిసిటీ, ఎక్సైజ్, ల్యాండ్, కుటుంబ తగాదాలు, మున్సిపాలిటీ, ప్రీ లిటిగేషన్ కేసులను ఇరువర్గాల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారం

విజయనగరం క్రైమ్: పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం పోలీస్ వెల్ఫేర్‌డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను నోట్ చేసుకున్నారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

వరద బాధితులకు కూరగాయలు



ట్రక్కును ప్రారంభిస్తున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం ఫోర్ట్: విజయవాడ వరద బాధితులకు అందించేందుకు కూరగాయలతో కూడిన రెండు ట్రక్కులకు శుక్రవారం జేసీ సేతుమాధవన్ జెండా ఊపారు. జిల్లాలో పలు రైతు బజార్ల నుంచి సేకరించిన ఉల్లిపాయలు, బంగాళదుంపలు, క్యాబేజీ, వంకాయలు, మిరప, దొండకాయలను పంపించినట్లు వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఏడీ రవికిరణ్ తెలిపారు. కార్యక్రమంలో రైతు బజార్ల ఏస్టేట్ అధికారులు చప్ప సతీష్‌కుమార్, ఉమా మహేశ్వరావు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పెద్దమనసు



కలెక్టర్ అంబేడ్కర్‌కు డీడీ అందజేస్తున్న విద్యార్థులు

విజయనగరం ఫోర్ట్: వరద బాధితులను ఆదుకునేందుకు నెల్లిమర్ల మండలం జరజాపుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రూ.22 వేలును పోగుచేసి కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు డీడీ రూపంలో శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ ప్రేమకుమార్, హెచ్ఎం ఆదినారాయణ పాల్గొన్నారు.



ఆ ఆలోచనే తప్పు

కొత్త వైద్య కళాశాలలను అడ్డుకోవడం, ప్రైవేటు పరంచేసే కూటమి ప్రభుత్వ ఆలోచనే తప్పు. ఇది పేద కుటుంబాల పిల్లలను వైద్యవిద్యకు దూరం చేస్తుంది. గత ప్రభుత్వం కొత్త కళాశాలలను అందుబాటులోకి తెచ్చి చదువుకు అండగా నిలిచింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిర్ణయంతో నీట్‌లో ర్యాంకు సాధించి సీటువస్తుందని ఆశించిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగో చరంగా మారుతుంది.

– బి.తిరుపతిరావు, ఇందిరమ్మకాలనీ, బొబ్బిలి





ప్రైవేటుపరం చేయొద్దు

ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరమైతే మెడికల్ సీట్లు ఎక్కువగా మేనేజ్‌మెంట్ కోటాలో చేరుతాయి. దీనివల్ల పేద కుటుంబాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు వైద్యవిద్య భారంగా మారుతుంది. ప్రైవేటీకరణ చేస్తే నాణ్యమైన సేవలు అందించే డాక్టర్ల ఉత్పాదన తగ్గుతుంది. వీటికి తోడు మాలాంటి మధ్యతరగతి కుటుంబాల పిల్లలను మెడిసిన్ చదివించడం చాలా కష్టం. ప్రభుత్వ కాలేజీలను యథావిధిగా కొనసాగించాలి.

– గొర్లె నారాయణరావు, నీట్ ర్యాంకర్ తండ్రి, రాజాం

కష్టాలు తీర్చిన వైద్య కళాశాల

విజయనగరంలో గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటుచేసిన వైద్యకళాశాలతో... జిల్లా ఆస్పత్రి సర్వజన ఆస్పత్రిగా రూపాంతరం చెందింది. సౌకర్యాలు సమకూరాయి. వైద్యులు, సిబ్బంది సంఖ్య పెరిగింది. సూపర్‌స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అత్యవసర వేళ విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు పరుగు తీయాల్సిన అవసరం తప్పింది. న్యూరో సర్జరీ, న్యూరో మెడిసిన్ వైద్యసేవలు స్థానికంగానే అందుతున్నాయి. అన్నింటికీ మించి 150 మంది విద్యార్థులకు వైద్యవిద్యనభ్యసించే అవకాశం కలిగింది. ఇన్ని ప్రయోజనాలున్న కళాశాలలు మాకొద్దంటూ కూటమి ప్రభుత్వం జాతీయ వైద్యకమిషన్‌కు లేఖలు రాయడాన్ని విద్యార్థులు, ప్రజలు తప్పుబడుతున్నారు. వైద్యవిద్యను ప్రైవేటుపరం చేసే కుటిలయత్నాలపై కలవరపడుతున్నారు.

- వైద్యకళాశాల ఏర్పాటుతో అక్కరకు వచ్చిన వైద్యసేవలు
- సర్వజన ఆస్పత్రిగా మారిన జిల్లా ఆస్పత్రి
- పెరిగిన వైద్యులు, సిబ్బంది సంఖ్య
- 300 మందికి ఉపాధి
- అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ సేవలు
- జిల్లాలోనే న్యూరోసర్జరీ, న్యూరో మెడిసిన్ వైద్యం
- గతంలో ఈ సేవలకు కేజీహెచ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి
- కొత్తవైద్యకళాశాలలకు నేడు కూటమి ప్రభుత్వం మోకాలడ్డు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

విజయనగరం ఫోర్ట్:

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రభుత్వ పరంగా అన్ని వైద్యసౌకర్యాలు ఉన్న ఆస్పత్రి గతంలో ఉండేది కాదు. జిల్లా ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడేవారు. అత్యవసరమైతే విశాఖపట్నం కేజీహెచ్‌కు పరుగులు తీయాల్సిన పరిస్థితి. ఆ క్రమంలోనే మార్గం మధ్యలో రోగులు మృత్యుఒడికి చేరుకునేవారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిల్లాకు వైద్యకళాశాలను మంజూరు చేసింది. గాజులరేగ సమీపంలో యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం చేపట్టి తొలిఏడాది ఎంబీబీఎస్ ప్రవేశాలు కల్పించింది. వైద్యకళాశాల ఏర్పాటుతో అనుబంధంగా జిల్లా ఆస్పత్రిని సర్వజన ఆస్పత్రిగా మార్చింది. కోట్లాది రూపాయల ఖర్చుతో ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చింది. నిపుణులైన వైద్యులు, సిబ్బందిని నియమించింది. ప్రస్తుతం జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. అత్యవసర, ఆపద వేళ కేజీహెచ్‌కు పరుగు తీయాల్సిన అవసరం తప్పింది. జిల్లా ప్రజలకు ఆరోగ్య భరోసా లభించింది.

70 ఎకరాల్లో వైద్య కళాశాల నిర్మాణం

ప్రభుత్వ వైద్య కళాశాలను గత ప్రభుత్వం 70 ఎకరాల్లో రూ.500 కోట్లతో నిర్మాణం తలపెట్టింది. మొదటి ఏడాది తరగతులు పూర్తయ్యాయి. వైద్య విద్యార్థులకు కొద్దిరోజుల్లో రెండో ఏడాది తరగతులు ప్రారంభం కానున్నాయి. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఫస్ట్ ఇయర్ కోసం అడ్మిషన్లు సైతం ప్రారంభమయ్యాయి. 150 మందికి సీట్లు లభించనున్నాయి.

పెరిగిన సిబ్బంది

వైద్య కళాశాల ఏర్పాటుతో వైద్యులు, సిబ్బంది పెరిగారు. 10 మంది ప్రొఫెసర్లు, 22 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 41 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 25 మంది సీనియర్ రెసిడెన్స్‌లు నియామకమయ్యారు. స్టాఫ్ నర్సులు, జనరల్ డ్యూటీ అటెండెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ప్లంబర్, లైబ్రరీ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, రేడియోగ్రాఫర్, ఆడియాలజిస్టు, తదితర కేడర్లకు సంబంధించి వైద్య కళాశాల, సర్వజన ఆస్పత్రికి కలిపి సుమారు 150 నుంచి 200 మంది వరకు కొత్తగా నియామకయ్యారు.

మెరుగైన వైద్యం

ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జిల్లా సర్వజన ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. గతంలో అందుబాటులో లేని పలమనాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఎఫ్ఎన్ఏసీ, మైక్రో బయాలజీ, ఫోరెన్సిక్ వంటి సేవలు ప్రస్తుతం అందుతున్నాయి. న్యూరో సర్జరీ, న్యూరో మెడిసిన్ సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఈ సేవల కోసం రోగులు కేజీహెచ్‌కు వెళ్లాల్సి వచ్చేది. కాంప్లికేటెడ్ కేసులకు కూడా సర్వజన ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్లేట్ లెట్స్ సంఖ్య 5 వేలు, 10 వేలకు తగ్గిన రోగులకు గతంలో రిఫర్ చేసేవారు. ప్రస్తుతం ఇక్కడే చికిత్స అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో (వెంటిలేటర్)పై చికిత్స కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి తప్పింది.

ఉద్యోగ అదృష్టం



ఎంఎల్‌టీ చదివాను. నోటిఫికేషన్ రాకపోవడం వల్ల ఎనిమిదేళ్ల పాటు ప్రైవేటు ల్యాబ్‌లో పనిచేశాను. వైద్య కళాశాల ఏర్పాటుతో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగ కల నెరవేరింది.

– ఎస్.లక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్, పెథాలజీ ల్యాబ్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

ఉపాధి కలిగింది



ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు తర్వాత ఇచ్చిన నోటిఫికేషన్‌లో జీడీఏ (జనరల్ డ్యూటీ అటెండెంట్) పోస్టుకు దరఖాస్తు చేశాను. ఉద్యోగం వచ్చింది. వైద్య కళాశాల ఏర్పాటుకాకుంటే ఉద్యోగం వచ్చేదికాదు.

– మత్రాపు శ్రావణ్, జీడీఏ, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

వైద్యకళాశాల ఏర్పాటుతో ఉద్యోగం వచ్చింది



ఎంఎల్‌టీ చదివాను. పదేళ్లపాటు ప్రైవేట్ ల్యాబ్‌లో పనిచేశాను. నెలకు రూ.6 వేలు నుంచి రూ.7వేల వరకు జీతం ఇచ్చేవారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు సంబంధించి బల్క్‌గా పదేళ్ల కాలంలో ఎప్పుడూ నోటిఫికేషన్ రాలేదు. వైద్య కళాశాల ఏర్పాటు కావడం వల్ల నోటిఫికేషన్ వచ్చింది. ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం లభించింది.

– మరిపి ఎర్నాయుడు, ల్యాబ్ టెక్నీషియన్, బయో కెమిస్ట్రీ ల్యాబ్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ సేవలు



న్యూరోసర్జరీ, న్యూరో మెడిసిన్ వంటి సూపర్ స్పెషాలటీ సేవలు కేజీహెచ్‌లో అందుబాటులో ఉండేవి. ఇప్పుడు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోనే ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. న్యూరోసర్జరీలు కూడా ఆస్పత్రిలో జరుగుతున్నాయి. ప్రొఫెసర్లు, అసోసియేషట్ ప్రొఫెసర్ల రావడం వల్ల కాంప్లికేట్ కేసులకు కూడా ఆస్పత్రిలో చికిత్స అందించగలుగుతున్నాం.

– డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

అక్షర చైతన్యం



హిందీ దివస్ వారోత్సవాల్లో భాగంగా వంగర మండలంలోని అరసాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం అక్షర చైతన్యం కలిగించారు. హిందీలోని 'అ' ఆకారంలో ఏర్పడి జాతీయ భాష ప్రాధాన్యాన్ని తెలియజేశారు. హెచ్ఎం ఖండాపు జగదీశ్వరి, హిందీ ఉపాధ్యాయుడు మెరగల ఠాగూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీపరీక్షల్లో ప్రతిభచూపి బహుమతులు అందుకున్నారు. – వంగర

ఆక్రమణలో డీసీఎంఎస్ స్థలం

- ఆక్రమిత స్థలంలో దుకాణాల నిర్మాణం
- అడ్డుకున్న డీసీఎంఎస్ అధికారులు
- అధికార పార్టీ అండదండలతోనే ఆక్రమణ!



డీసీఎంఎస్ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న దుకాణాలు



అక్రమ నిర్మాణాలను పర్యవేక్షిస్తున్న డీసీఎంఎస్ మేనేజర్, అధికారులు

చీపురుపల్లి: పట్టణ నడిబొడ్డున, విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారికి ఆనుకుని సర్వే నంబర్ 47/2లో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)కి చెందిన 1.69 ఎకరాల స్థలం ఉంది. కోట్లాది రూపాయల విలువైన ఈ స్థలంపై అక్రమార్కుల కన్నుపడింది. వారికి అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఇంకేముంది.. స్థలంతో కొంత భాగాన్ని ఆక్రమించేశారు. వ్యాపారం చేసుకునేందుకు అనువుగా దుకాణాల నిర్మాణాన్ని తలపెట్టారు. విషయం డీసీఎంఎస్ అధికారులకు తెలియడంతో బిజినెస్ మేనేజర్ బి.సాయికుమార్ నేతృత్వంలో ఉద్యోగులు శుక్రవారం చీపురుపల్లి వచ్చారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. డీసీఎంఎస్ స్థలంలో ఎలా నిర్మాణాలు జరుపుతారంటూ ఆక్రమణదారులను హెచ్చరించారు. అధికార పార్టీ పెద్దలే దుకాణాలు నిర్మించుకోవాలని సూచించినట్లు అధికారులకు కొందరు చెప్పడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

చర్యలు తప్పవు

చీపురుపల్లి పట్టణంలోని సర్వే నంబర్ 47/2లో 1.69 ఎకరాల స్థలం డీసీఎంఎస్‌కు ఉంది. ఆ స్థలాన్ని ఎవరు ఆక్రమించినా సహించేది లేదు. ఆ స్థలం డీసీఎంఎస్‌కు చెందినదిగా కోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నాయి. ఒక దుకాణం నిర్మాణానికి తహసీల్దార్ అనుమతి ఉందని చెబుతున్నారు. దానిని పరిశీలిస్తాం. ఆక్రమణ నివేదికను జేసీకి అందజేస్తాం.

– బి.సాయికుమార్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్

జీఎన్ఎంల ధర్నా

- కించపరిచేలా మాట్లాడేవారిపై చర్యలకు డిమాండ్



ధర్నా చేస్తున్న జీఎన్ఎంలు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలోని కొన్ని ఆస్పత్రుల్లో తమ విధులను కించే పరిచేలా మాట్లాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని జీఎన్ఎం శిక్షణ పూర్తిచేసిన ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు జీఎన్ఎంలు మాట్లాడుతూ పల్లెల్లో ఏళ్ల తరబడి ఏఎన్ఎంలుగా అందించిన సేవలను గుర్తించిన గత ప్రభుత్వం జీఎన్ఎంలుగా రెండున్నరేళ్లపాటు శిక్షణ ఇచ్చిందన్నారు.

జీఎన్ఎంలుగా గుర్తిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జీఓ కూడా జారీ చేశారన్నారు. దీనిని జీర్ణించుకోలేని కొందరు... మేము వైద్యసేవలు అందిస్తే శవాలు లేస్తాయంటూ కించపరిచేలా మాట్లాడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తమ విధులకు భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో జీఎన్ఎంలు టి.కుమారి, జి.చాముండేశ్వరి, ఎ.సీత, బి.సరోజిని, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు ఏవి 'బాబూ'..!

- ప్రీస్కూల్ చిన్నారుల భవితపై నిర్లక్ష్యం
- పుస్తకాలు లేకపోవడంతో బోధనకు ఆటంకం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- పుస్తకాలు అందజేయాలని తల్లిదండ్రుల డిమాండ్



గత ప్రభుత్వం అందజేసిన కిట్లతో బోధన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

రామభద్రపురం:

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల భవితను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలు పునఃప్రారంభించి దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా ఇంత వరకు పిల్లలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదు. చిన్నారులకు ఆట పరికరాల కిట్లు కూడా అందజేయలేదు. పాత పుస్తకాలు, కిట్లతోనే అంగన్‌వాడీ టీచర్లు బోధన సాగిస్తున్నారు. బాల్యదశలోనే విజ్ఞానాన్ని పెంపొందించేందుకు, ఆటపాటలతో కూడిన విద్యా బోధనకు వీలుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ఏటా ఠంచన్‌గా పుస్తకాలు సరఫరా చేసేది. ఆట పరికరాలను సమకూర్చేది. పౌష్టికాహారంతో పాటు బోధన ఆహ్లాదంగా సాగేందుకు అనువైన వసతులు కల్పించేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ విధానాలకు మంగళం పాడింది. బాల్య దశలోనే విద్యా పరంగా గట్టి పునాదులు వేసే అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తుండడం చిన్నారుల తల్లిదండ్రులను కలవరపెడుతోంది. ప్రభుత్వం స్పందించి తక్షణమే పుస్తకాలు సరఫరా చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

భవిష్యత్తుకు గట్టి పునాది పడేలా...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు నాలుగు పుస్తకాలతో కూడిన బర్స్–1 కిట్లు అందేవి. అంగన్‌వాడీల్లో ప్రవేట్, కార్పొరేట్ స్కూళ్ల తరహాలోనే చిన్నారులకు విద్యాబోధన సాగింది. దీనివల్ల అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. నాలుగేళ్ల లోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–1 కిట్లు అందజేసింది. ఐదేళ్లలోపు పిల్లలకు కూడా ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–2 కిట్లు ఇచ్చింది. దీంతో వారికి బోధన చాలా సులభంగా, అర్థమయ్యే రీతిలో సాగేది. కొత్త ప్రభుత్వం పుస్తకాల సరఫరాకు మంగళం పాడి పాత విధానాన్ని అమల్లోకి తెచ్చే ఆలోచనతో ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రశ్నార్థకంగా చిన్నారుల భవిష్యత్



జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 24,953 మంది ప్రీస్కూల్ పిల్లలు చదువుతున్నారు. వీరందరికీ ఈ ఏడాది పాఠ్యపుస్తకాలు అందలేదు. చిన్నారులకు బోధించేందుకు పుస్తకాల లేమి సమస్య వెంటాడుతోంది. కొన్ని కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు పాత పుస్తకాలతో అరకొరగా విద్యాబోధన కొనసాగిస్తున్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా చిన్నారులు ప్రీస్కూల్‌కు ఎక్కడ చేరితే అదే విద్యాసంస్థల్లోనే విద్యార్థిగా కొనసాగే అవకాశం ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తే చిన్నారులు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎల్‌కేజీ, యూకేజీల్లో చేరుతారు. ఆ తర్వాత కూడా ప్రైవేట్ పాఠశాలల్లోనే చదువు కొనసాగిస్తారు. దీంతో ప్రైవేట్ యాజమాన్యాలకు మేలు చేకూరుతుంది. కేవలం కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేకూర్చేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.



రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రం-5లో పాత పుస్తకాలతో చేస్తున్న బోధనను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ సూర్యకుమారి (ఫైల్)

త్వరలో వస్తాయి..

అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు సంబంధించి పుస్తకాలు ఇంకా రాలేదు. త్వరలో వచ్చే అవకాశం ఉంది. పుస్తకాలు వచ్చిన వెంటనే కేంద్రాలకు సరఫరా చేస్తాం. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలు పాత పుస్తకాలు ద్వారానే బోధన చేస్తున్నారు. బోధనలో ఇబ్బందులు లేవు. చిన్నారులకు ఎలాంటి సమస్య లేకుండా చూస్తాం.

– శాంతకుమారి, పీడీ, ఐసీడీఎస్, విజయనగరం

క్లుప్తంగా

పీసా ఎన్నికలు నిర్వహించండి



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని 41 పంచాయతీల్లో పీసా ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్‌శంకరన్ సమావేశ మందిరంలో గ్రామ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెల 24 నుంచి వచ్చేనెల 8 వ తేదీలోపు 102 గ్రామసభలు పెట్టాలని, అలాగే పీసాచట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, ఎంపీడీవో గీతాంజలి, తహసీల్దార్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన బియ్యం పరిశీలన



పట్టుబడిన బియాన్ని పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి మధుసూదనరావు

చీపురుపల్లి: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో పట్టుబడిన 37,600 కేజీల బియ్యాన్ని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి మధుసూదనరావు చీపురుపల్లిలో శుక్రవారం పరిశీలించారు. మెరక ముడిదాం మండలంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాలశాఖ సంయుక్తంగా గురువారం జరిపిన దాడుల్లో 37,600 కేజీలు బియ్యం పట్టుబడ్డాయి. ఆ బియ్యాన్ని సీజ్ చేసి చీపురుపల్లి ఎంఎల్ఎస్ గొడౌన్‌లో అప్పగించారు. ఈ బియ్యాన్ని పరిశీలించిన ఆయన జాగ్రత్తలు తీసుకోవాలని గొడౌన్ ఇన్‌చార్జికి సూచించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ పిన్నింటి రామారావు ఉన్నారు.

298 మద్యంసీసాల పట్టివేత



మాట్లాడుతున్న సీఐ నారాయణ రావు

బాడంగి: మండలంలోని రావివలస చెరువు ప్రాంతంలో పోలీసులు కాపుకాసి ఇద్దరు వ్యక్తులనుంచి 298 మద్యం బాటిల్స్ పట్టుకున్నారు. దీనిపై బొబ్బిలి సీఐ నారాయణరావు శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక ఎస్సైకి వచ్చిన సమాచారం మేరకు మండలంలోని రావివలస చెరువువద్ద గురువారం రాత్రి కాపుకాసి మోటార్ సైకిల్‌పై వస్తున్న వాడాడకు చెందిన రవ్వా శంకరరావు, రెడ్డిరాఘవరావులను తనిఖీచేయగా 298 క్వార్టర్ మద్యం సీసాలుగా పట్టుబడినట్లు తెలిపారు. దీంతో మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక మాగార్డెన్ సమీపంలో సుజుకీ షోరూం పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. డయల్ 100కి వచ్చిన సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా మృతిచెందిన వ్యక్తి సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయసు కలిగి ఉన్నాడని, అక్కడ విచారణ చేయగా మృతుడి గురించి ఎటువంటి సమాచారం లభించలేదన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

నదిలో పడి ఎద్దుల మృతి


శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి ఆధారమైన జోడెద్దులు గోస్తనీ నది గోతిలో పడి ప్రాణాలు వదిలాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ధర్మవరపు కోటరావు రోజూ మాదిరిగా ఇసుక కోసం బండిని నదికి తోలాడు. బండికి ఇసుక నింపిన తర్వాత ఒడ్డుకు వచ్చేందుకు బండి తోలుతున్న సమయంలో ఒకేసారి రెండు ఎద్దులు అకస్మాత్తుగా గోతిలో పడిపోయాయి. నదిలో నీటిప్రవాహం ఉండడంతో గోతిలో చిక్కుకుపోయి ఊపిరాడక ప్రాణాలు వదిలేశాయి.

పండగలకు ప్రత్యేక రైళ్లు

విజయనగరం టౌన్: దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే సీనియర్ డీసీఎం కె.సందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 07487 సికింద్రాబాద్-శ్రీకాకుళం రోడ్డు ఏసీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ అక్టోబరు 2వ తేదీ నుంచి నవంబరు 6వ తేదీ వరకూ ఆరు ట్రిప్‌లు నడుస్తుందని, అదే విధంగా రైలు నంబర్ 07488 శ్రీకాకుళం రోడ్డు - సికింద్రాబాద్ స్పెషల్ ట్రైన్ అక్టోబరు 3 నుంచి నవంబరు 7వరకూ ఆరు ట్రిప్పులు తిరుగుతుందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు గల అన్ని స్టేషన్లలో రైలు ఆగుతుందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హిందుస్థాన్ హమారా

- ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించే జాతీయభాష
- రోజురోజుకు హిందీ భాష పట్ల పెరుగుతున్న ఆదరణ
- నేడు జాతీయభాషా దినోత్సవం



హిందీ దివస్



హిందీ దివస్ ఉత్సవాల్లో విశ్రాంత హిందీ భాషోపాధ్యాయులకు సత్కారం (ఫైల్)



పెనుబాక పాఠశాలలో హిందీ ప్రచార సభ పరీక్షల్లో విద్యార్థులు (ఫైల్)

రాజాం: దేశ ప్రజలను ఏకం చేసే, ఏకతాటిపైకి తెచ్చే మహత్తర మాధ్యమం జాతీయ భాష హిందీ. దాదాపు 3,372 పైగా భాషలను దేశ ప్రజలు మాట్లాడుతుండగా..వాటిలో 24 అధికార భాషలను గుర్తించినప్పటికీ..జాతీయ భాషగా హిందీనే భావిస్తున్నాం. దేశంలో హిందీ భాషను మాట్లాడేవారు, అర్థం చేసుకునేవారు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 1949 సెప్టెంబర్ 14న భారత రాజ్యాంగంలోని 343వ అధికరణం దేవనాగరి లిపిలోని హిందీని అధికార భాషగా గుర్తించింది. నాటినుంచి ఏటా సెప్టెంబర్ 14న హిందీని జాతీయ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ నేపథ్యంలో హిందీ దివస్‌కు సంబంధించి మరిన్ని వివరాలు.

ఉపాధి..ఉద్యోగావకాశాలు..

హిందీ భాషను నేర్చుకున్నవారికి, అందులో డిగ్రీ పట్టా పొందినవారికి ఉపాధి, ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. కేంద్ర సాయుధ బలగాల్లో చేరేందుకు హిందీ భాషలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. రైల్వే ఉద్యోగాలు పొందే వారిలో ఎక్కువమంది హిందీ భాషపై పట్టు ఉన్న వారే కనిపిస్తున్నారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ్, విద్వాన్ వంటి కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు సివిల్ సర్వీసులతో పాటు డిగ్రీ తత్సమాన పోటీ పరీక్షలు, ఉద్యోగ పరీక్షలకు అర్హులుగా గుర్తింపు పొందుతున్నారు.

విశిష్ట సేవలు అందిస్తున్న ప్రచారక్‌లు..

ఇప్పుడు హిందీ భాషపైన, ఆవశ్యకతపైన ప్రజల్లో అవగాహన కలిగింది. ఫలితంగా అన్ని ప్రాంతాల్లో హిందీ ప్రచారక్‌లు ముందుకు వచ్చి హిందీ ప్రాథమిక స్థాయి పరీక్షల నుంచి ఉన్నత స్థాయి పరీక్షల కేంద్రాలు ఏర్పాటుచేసి విద్యార్థులను తయారు చేస్తున్నారు. పూర్తి సమయం కాకుండా కొంత సమయాన్ని కేటాయించి గృహిణులు, ప్రైవేట్ ఉద్యోగులు ఈ కోర్సులు పూర్తిచేసి, అనంతరం ప్రభుత్వ కొలువులు పొందుతున్నారు. జిల్లాలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ ప్రచారక్ కె. మధుసూధనరావు ఇటు విజయనగరం, అటు శ్రీకాకుళం జిల్లాలోని విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించి, ప్రతి ఏటా వందలాదిమంది విద్యార్థులను తయారు చేస్తున్నారు.

వారోత్సవాలు..

హిందీ దివస్ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 14న హిందీ భాషా దినోత్సవం నిర్వహిస్తారు. హిందీ ప్రచారక్‌లు ఉన్న కేంద్రాల్లో వారోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహించి ర్యాలీలు చేయడంతో పాటు ప్రజలకు హిందీ భాషపై అవగాహన కల్పిస్తారు. హిందీ భాష అభివృద్ధికి కృషిచేసిన హిందీ భాష సాహితీవేత్తలు, కవులతో పాటు రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరిస్తారు.

హిందీ భాషతో ఉపాధి..



హిందీ భాష చాలా మందికి ఉపాధి కల్పిస్తుంది. పది, ఇంటర్ తరువాత హిందీ సబ్జెక్ట్‌గా తీసుకుని డిగ్రీ చేయడం, తర్వాత హిందీ పండిట్ శిక్షణ పొంది మంచి ఉద్యోగాలు సాంపాదిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో హిందీ బోధనోపాధ్యాయులకి మంచి డిమాండ్ ఉంది. హిందీ భాషకు సంబంధించి ప్రస్తుతం ట్యూషన్ సెంటర్లు కూడా పెట్టి చాలా మంది ఉపాధి పొందుతున్నారు. మా ప్రచారక్ కేంద్రం వద్ద ప్రతి ఏదాది 120 మందికి పైగా కొత్త విద్యార్థులు దక్షిణభారత హిందీ ప్రచార సభ మద్రాస్ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత చెంది పట్టాలు పొందుతున్నారు.

– కె. మధుసూదనరావు, హిందీ ప్రచారక్, రాజాం

ఇలా మొదలైంది..

మనదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో హిందీ మాతృభాషగా ఉంది. అలా అని అక్కడ హిందీ ఒక్కటే లేదు. దాంతో పాటు మరికొన్ని ఇతర భాషలు కూడా ఉన్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఒడిశా, పంజాబ్, బెంగాల్, కశ్మీర్ రాష్ట్రాల వారికి ప్రాంతీయ మాతృభాషలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లినప్పుడు భాషా సమస్య ఉత్పన్నమైంది. బ్రిటిష్ పాలనా కాలంలో ఇంగ్లీషును స్కూల్స్‌లో బోధించారు. దీంతో అన్ని రాష్ట్రాల ప్రజలను ఏకం చేసే భాషగా అప్పట్లో ఇంగ్లీషు వెలుగొందింది. ఇది దేశానికి స్వాతంత్ర్యం రాకముందు ముచ్చట. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక..ప్రభుత్వ కార్యకలాపాలను జాతీయ స్థాయిలో నిర్వహించడానికి ఏ భాషను వాడాలి? అనే ప్రశ్న తెరపైకి వచ్చింది. దీనిపై దేశ జాతీయ నాయకుల మధ్య జరిగిన చర్చల ఫలితంగా 1949 సెప్టెంబర్ 14న హిందీని అధికార భాష గా నిర్ణయించారు. ఎన్నో మలుపుల మధ్య భారత రాజ్యాంగం లోని 343వ అధికరణం దేవనాగిరి లిపిలోని హిందీని అధికార భాషగా గుర్తించింది. ఆ కారణంగా నాటి నుంచి ఆంగ్ల భాష అధికార హోదాను కోల్పోయింది. హిందీ భాషకు పట్టంకట్టారు. నాటి నుంచి సెప్టెంబర్ 14న జాతీయ హిందీ భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం.

ఎన్నో విశేషాలు

- హిందీ ..అనే పదం పర్షియన్ భాషలోని హిండ్ నుంచి వచ్చింది. హిండ్ అంటే సింధు నది ప్రవహించే నేల అని అర్థం.
- 11వ శతాబ్ద కాలంలో టర్కీ పాలకులు మన దేశంపై దండయాత్రకు వచ్చినప్పుడు హింద్ అనే పదాన్ని ఉపయోగించినట్లు చరిత్ర పరిశోధకులు చెబుతుంటారు.
- నేపాల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఫిజీ, మారిషస్, సురినామ్, కెనడా, అమెరికా, దక్షిణాఫ్రికా, ఉగాండా, ట్రినిడాడ్, న్యూజిలాండ్ ఇలా అనేక దేశాల్లో హిందీ మాట్లాడే వారు అధిక సంఖ్యలో ఉన్నారు.
- ప్రపంచ వ్యాప్తంగా 180కిపైగా విశ్వ విద్యాలయాల్లో హిందీ భాషకు సంబంధించిన అధ్యయనాలు, పరిశోధనలు జరుగుతున్నాయి.

ప్రపంచ భాషల్లో మూడో స్థానం

- ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా మాట్లాడే భాషలను జనాభాపరంగా పరిశీలిస్తే ఇంగ్లీషు, చైనీస్ భాషల తర్వాతి స్థానం హిందీదే.
- టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వెబ్ అడ్రస్‌లు రూపొందించడానికి ఉపయోగిస్తున్న ఏడు భాషల్లో హిందీ కూడా ఒకటి.
- 1968లో సుమిత్రానందన్ పంత్‌కు హిందీ సాహిత్య సేవలకు గానూ జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది.
- 1982లో హిందీ సాహిత్యంలో జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన తొలి మహిళగా మహాదేవి వర్మ నిలిచారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలి

- జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు



టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ టెన్నికాయిట్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచి విజేతలుగా నిలవాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా పలాసలో జరగనున్న అంతర్ జిల్లాల సబ్‌జూనియర్స్ బాల,బాలికల పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలిచి విజయనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పాలని కోరారు. ఎంపిక పోటీలను టెన్ని కాయిట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రామారావు, స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, పీడీలు కె.గోపాల్, బంటుపల్లి శివ, మీసాల శ్రీనివాసరావు, మజ్జి తిరుపతి రావు, లక్ష్మీశేఖర్, సత్యనారాయణలు పర్యవేక్షించారు.

పోలమాంబను దర్శించిన కలెక్టర్



వనంగుడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజన దేవత శంబరపోలమాంబ అమ్మవారి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శంబర గ్రామంలో కొలువైన పోలమాంబ అమ్మవారి వనంగుడి, చదురుగుడిలను శుక్రవారం ఆయన సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను సాదరంగా స్వాగతించగా, వేదపండితులు అమ్మవారికి కలెక్టర్‌తో ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వచనాలు అందజేశారు.

ఆలయ అభివృద్ధిపై సమీక్ష

పోలమాంబ అమ్మవారి పండగ వచ్చేఏడాది జనవరి నెలలో జరగనుంది. ఈ మేరకు జాతరకు వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముందుగానే అధికారులు, గ్రామపెద్దలు, దేవాదాయశాఖ అధికారులతో ఆలయ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు.

పెండింగ్ నిధుల మంజూరుకు చర్యలు

తన పర్యటనలో భాగంగా వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్‌ను, సువర్ణముఖినది రెగ్యులేటర్ గేట్లను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. ప్రాజెక్ట్ ఆధునికీకరణకు అవసరమైన పనులపై ఈ సందర్భంగా ఆరా తీశారు. పెండింగ్ నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురం ఆర్అండ్‌బీ రహదారి మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలలోకి వెళ్తే..పూసపాటిరేగ మండలం రోలుచప్పిడి గ్రామానికి చెందిన కొయ్య రమణ(30) పనినిమిత్తం బైక్‌పై విజయనగరం వెళ్లి తిరిగి వస్తుండగా గోవిందపురం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య వైష్ణవి ఉంది. మృతదేహాన్ని సుందరపేట ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పూసపాటిరేగ ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

విజయనగరం క్రైమ్: ఒడిశా నుంచి తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నిందితుడిని జీఆర్‌పీ సిబ్బంది శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి దగ్గర నుంచి 5 కిలోల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు తెలిపారు. గంజాయి తరలిస్తున్న నిందితుడు ఆనంద సెల్వన్‌దొరైను అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం విశాఖ రైల్వే కోర్టుకు పంపించామని చెప్పారు.

గంజాయి అమ్ముతున్న ఐదుగురి అరెస్ట్

విజయనగరం క్రైమ్: గంజాయి అమ్మకాలు చేస్తున్న ఐదుగురు నిందితులను స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుకున్న వారిలో ఒడిశాకు చెందిన బెహరా సంతోష్‌కుమార్, విజయనగరంలోని శాంతినగర్‌కు చెందిన వాసుపల్లి విజయ, బూర్లిపేటకు చెందిన బోడసింగి లోహిత్, గాజులరేగకు చెందిన కె.చందులతో పాటు మరో జువైనల్ ఉన్నారని పేర్కొన్నారు.

యోగా పోటీలకు జిల్లా జట్టు సిద్ధం

- నేటి నుంచి భీమిలిలో రాష్ట్రస్థాయి పోటీలు



రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న యోగా పోటీలకు విజయనగరం జిల్లా జట్టు సిద్ధమైంది. జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని బాలాజీనగర్‌లో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరు కాగా వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విక్రమ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14, 15వ తేదీల్లో విశాఖ జిల్లా భీమిలిలోని సన్ స్కూల్‌లో జరగనున్న సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో యోగా పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శనతో పతకాలు సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.సన్యాసిరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, కోచ్‌లు బి.యశోద, ఆర్. రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఆర్.గోవిందరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: గంట్యాడ మండలంలోని మధుపాడ గ్రామంలో జరిగిన హత్యకేసులో నిందితుడ్ని అరెస్టు చేసి , రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఈ నెల 11న బుధవారం రాత్రి వినాయక నిమజ్జనం కార్యక్రమం సందర్భంగా అర్ధరాత్రి సమయంలో నిందితుడు పాటూరి సాయిరామ్ చెల్లికి, మృతుడు చెల్లంనాయుడు (35)ల మధ్య వివాహేతర సంబంధం విషయంలో ఉన్న పాత గొడవలు మనసులో పెట్టుకుని, చెల్లంనాయుడికి నిందితుడు సాయిరామ్ మద్యం పట్టించి, పీక నులిపి, కిందపడేశాడు. తర్వాత దగ్గరలో ఉన్న బరువైన సిమెంట్ ఇటుక దిమ్మెను చెల్లంనాయుడి తలపై మూడు సార్లు పడేయడంతో చెల్లంనాయుడు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఈ సమాచారం మేరకు డీఎస్పీ గోవిందరావు, సీఐ రామకృష్ణ, క్లూస్ టీమ్ సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆధారాలు సేకరించారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు.

పశుబీమాలోనూ.. 'పచ్చ'పాతం..!

- పరిమితంగా పశు బీమా పథకం
- తెలుగు తమ్ముళ్లకు చెందిన పశువులకే తొలి ప్రాధాన్యం
- గతంలో పార్టీలకు అతీతంగా అన్నిరకాల సంక్షేమం
- కూటమి ప్రభుత్వం పరిమితులు, షరతులతో పథకాలకు కోత
- కేవలం 976 యూనిట్ల క్లెయిమ్‌లే లక్ష్యం
- లబోదిబోమంటున్న పాడి రైతులు, జీవాల పెంపకందారులు



ఆవు చెవికి వేసిన పశుబీమా పథకం ట్యాగ్

జిల్లాలో పశుసంపద ఇలా..

పాడిఆవుల సంఖ్య	4లక్షలు
గేదెలు	2 లక్షలు
జీవాల సంఖ్య (గొర్రెలు, మేకలు)	3.88 లక్షలు పైబడి

రాజాం: ప్రభుత్వం మారింది.. ప్రతీ పథకానికి పేరు మారింది. యూనిట్లలో కోత.. లబ్ధిదారుల కుదింపు ప్రక్రియ మొదలైంది. గత ప్రభుత్వం కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ఐదేళ్ల పాటు పాలన సాగించింది. ప్రతినెలా ఏదో ఒక సంక్షేమ పథకాన్ని పార్టీలతో సంబంధంలేకుండా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా డీబీటీ విధానంలో లబ్ధి సమకూర్చింది. ఇప్పుడొచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలులో జాప్యంతో పాటు పరిమితులు, షరతులు విధిస్తూ పార్టీ విధేయులకు పథకాలు అందించే పనిలో పడింది. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు ఇంకా ఆచరణకు నోచుకోలేదు. రైతుకు పెట్టుబడి సాయం, మత్స్యకార భరోసా, తల్లికివందనం వంటి పథకాల లబ్ధి అందక లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. తాజాగా పాడి రైతులు, జీవాల పెంపకందారులకు అండగా నిలిచే పశుబీమా పథకాన్నీ కొన్నియూనిట్లకే పరిమితం చేసింది. ఆ యూనిట్ల అమలులో కూడా 'పచ్చ'పాతం చూపుతోందంటూ పాడిరైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పలుకుబడి ఉన్నవారికే..

కొత్త ప్రభుత్వం పాడి పశువుల బీమా పథకం పంచాయతీల్లో టీడీపీలో బాగా పలుకుబడి ఉన్నవారికి మాత్రమే లభించే పరిస్థితి ఉంది. మూడు సంవత్సరాల కాలపరిమితితో కూడిన ఈ ఇన్సూరెన్స్ పథకం ద్వారా రూ.15 వేలు, రూ. 30 వేల బీమా అందించేందుకు రైతుల పాడి ఆవులకు ట్యాగ్‌లు వేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 80 శాతం రాయితీతో, ఇతరులకు 50 శాతం రాయితీతో బీమా అసలు నగదు చెల్లించాల్సి ఉంది. అన్ని పశుసంవర్ధక శాఖలు ద్వారా ఈ కార్యక్రమం గ్రామాల్లో అర్హులైన రైతులకు అందించాల్సి ఉండగా, బీమా ఉందన్న విషయం కూడా బయటకు తెలియనీయకుండా అధికారపార్టీకి చెందిన కార్యకర్తల పాడి ఆవులకు పశుసంవర్ధకశాఖ సిబ్బంది ట్యాగ్‌లు వేసి ఇన్సూరెన్స్ చేస్తున్నారు. దీంతో ఈ బీమా పథకంపై పాడి పరిశ్రమలపై ఆధారపడి, పెట్టుబడులు పెడుతున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలానికి 27 పాడి ఆవులకు మాత్రమే..

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 4 లక్షలకు పైగా పాడి ఆవులు, 2 లక్షల వరకు బర్రెలు, 3.88 లక్షల వరకూ గొర్రెలు ఉన్నాయి. వీటిలో అర్హత ఉన్న పాడి ఆవులు, గొర్రెలు, బర్రెలకు బీమా పథకం వర్తింపజేసి ఆపద వేళ రైతులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కూటమి ప్రభుత్వం మండలానికి కేవలం 27 పాడి ఆవులకు మాత్రమే ఆపదవేళ క్లెయిమ్‌చేయించుకునే నిబంధన తెచ్చింది. ఈ ప్రాతిపదికన ఒక్కో మండలంలో ఒక్కో పంచాయతీలో ఒక్క రైతుకు మాత్రమే బీమా వర్తించే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా కేవలం 976 యూనిట్లను లక్ష్యంగా చేసుకుని బీమాను కొత్త ప్రభుత్వం తెరమీదకు తీసుకొచ్చింది. ఆ అవకాశం కూడా టీడీపీ వర్గానికి చెందినవారికే కల్పిస్తుండడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

బీమా గురించి అసలు తెలియదు..



పాడి పశువుల బీమా అమలు జరుగుతుందనే విషయం మా పంచాయతీలో ఏ రైతుకు తెలియదు. మా పంచాయతీలో వందల సంఖ్యలో పాడి ఆవులు, గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఈ పథకం పంచాయతీకి ఒక్కరికే వర్తింపజేసేలా నిబంధన పెట్టడం విచారకరం. మాలో మాకే గొడవలు వచ్చేలా ఉన్నాయి. ఆపవేళ ఆదుకునే పథకంలో కోతపెట్టడం ప్రభుత్వానికి తగదు.

– రాజాపు రమణ, మిర్తివలస, సంతకవిటి మండలం

పశువులన్నింటికీ బీమా వర్తింపజేయాలి



రాష్ట్ర విభజన అనంతరం పాడి పశువుల బీమా పథకం అటకెక్కింది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ మేలుచేకూర్చింది. ఏ పథకం అమలుచేసినా గ్రామ సచివాలయాలు, వలంటీర్లు ద్వారా అవగాహన కల్పించే వారు. ఇప్పుడు ఈ ఏ పథకం గురించీ రైతులకు తెలియదు. పశుబీమా పథకాన్ని పరిమితం చేయవద్దు.

– బీవర త్రినాథరావు, రైతు, వన్నలి, రేగిడి మండలం